अलङ्कारविभागः

1. उपमालङ्कारः
2. अनन्वयालङ्कारः
3. उत्प्रेक्षालङ्कारः
4. दीपकालङ्कारः
5. अप्रस्तुत प्रशंसालङ्कारः
6. रूपकालङ्कारः

అలంకారములు:

(*FIGURES OF SPEECH*)

కావ్యమునకు ఆత్మ వంటిది రసము. శృంగారము, వీరము, హాస్యము మొదలైన తొమ్మిది రసములు సహృదయులకు అద్వితీయానందము నిచ్చును. శబ్దార్థాలు కావ్యము యొక్క స్వరూపములు. కర-చరణాదులకు ధరించబడు హార-నూపురాదికములైన అలంకారములు బాహ్య రూపమునెట్లు ప్రకాశింపజేయునో అట్లే కావ్యమునకు కూడ శబ్దార్థ- అలంకారములు బాహ్య అలంకారాలుగా పేర్కొనబడెను.

అలంకారములు రెండు రకములు. 1. శబ్దాలంకారములు. 2. అర్థాలంకారములు.

“ యమకం, అనుప్రాసము ” మొదలైనవి శబ్దాలంకారములు.

“ ఉపమా-రూపకము ” మొదలైనవి అర్థాలంకారములు.

ఈ అలంకారములు చమత్కారమును కలిగించి భాషకు శోభను చేకూర్చును. అందువలననే వీటిని ఆంగ్లభాషలో “Figure of Speech” అందురు. వ్యావహారిక భాష కంటె కావ్యభాషకు విశిష్టతను కలిగించునవి అలంకారములు.

శబ్దాలంకారములైన అనుప్రాసాదులు శబ్ద సౌందర్యమును మాత్రమే కలిగించును. ఉపమా, రూపకము,ఉత్ప్రేక్ష మున్నగు అర్థాలంకారములు అర్థరామణీయకమును సృష్టించును. వీటికి పరమావధి చమత్కారము. చమత్కారమనగా విశిష్టమైన సహృదయుని ఆనందము.

జయదేవుడు అను కవి “చంద్రాలోకః" అను గ్రంథమున అర్థాలంకారములను సోదాహరణముగా వివరించెను. పాఠ్యాంశములుగా నిర్ణయించబడిన కొన్ని అర్థాలంకారములు ఇక్కడ జయదేవుని అనుసరించి వివరించబడుచున్నవి.

1. उपमालङ्कारः

उपमा यत्र सादृश्यलक्ष्मी रुल्लसति द्वयोः ।
हंसीव कृष्ण ते कीर्तिः स्वर्गङ्गामवगाहते॥

ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయోః |
హంసీవ కృష్ణ తే కీర్తి: స్వర్గంగామవగాహతే ||

లక్షణము : यत्र = ఏ వాక్యమునందు, द्वयोः =ఉపమానోపమేయాలకు, सादृश्यलक्ष्मीः = సమానత్వము యొక్క శోభ, उल्लसति = ప్రకాశించునో, तत्र = ఆ వాక్యమందు, उपमा = ఉపమాలంకారము (అవును).

ఏ వాక్యమునందు ఉపమానోపమేయ పదములకు సమానత్వము మనోరంజకముగా చెప్పబడునో అది ఉపమాలంకారమగును.

ఉదా : कृष्ण = ఓ కృష్ణుడా !, ते = నీ యొక్క, कीर्तिः = కీర్తి, हंसीव = ఆడహంస వలె, स्वर्गङ्गाम् = ఆకాశగంగలో, अवगाहते = మునుగుచున్నది.

ఓ కృష్ణుడా ! నీ కీర్తి ఆడహంస వలె ఆకాశగంగ యందు మునుగుచున్నది.

సమన్వయము : **ఈ వాక్యమునందు కృష్ణుని యొక్క కీర్తి ఉపమేయము.**
ఆడహంస ఉపమానము.
ఆకాశగంగావగాహనము సమానత్వము చెప్పబడినది.

ఇక్కడ కృష్ణుని యొక్క కీర్తి భూలోకమునందే గాక స్వర్గమునందు వ్యాపించినదని చెప్పుట మనోరంజకముగా చెప్పబడినది. అందువలన ఉపమాలంకారమైనది.

2.अनन्वयाङ्कार:

उपमानोपमेयत्वं यत्रैकस्यैव वस्तुनः |
इन्दुरिन्दुरिव श्रीमानित्यादौ तदनन्वयः॥

ఉపమానోపమేయత్వం యత్రైకస్యైవ వస్తునః |
ఇందురిందురివ శ్రీమానిత్యాదౌ తదనన్వయః॥

లక్ష్యం : यत्र = ఎక్కడ, एकस्य वस्तुनः एव = ఒకే వస్తువునకే, उपमानोपमेयत्वं = ఉపమానంగా ఉపమేయముగా చెప్పుట యనునది (ఉండునో), तत् = అక్కడ, अनन्वयः =అనన్వయాలంకారము (అవును).

ఎక్కడ ఒకే వస్తువునకు ఉపమానోపమేయములు చెప్పబడునో, అది అనన్వయాలంకారము.

ఉదా : इन्दुः = చంద్రుడు, इन्दुः इव = చంద్రుని వలె, श्रीमान् = సుందరుడు.

చంద్రుడు చంద్రుని వలె సుందరుడు.

సమన్వయం : **పై వాక్యమునందు ఉపమానము చంద్రుడు. ఉపమేయము కూడ చంద్రుడు. ఒకే చంద్రునకు పోల్చుటకు దానికి తగిన వస్తువు లేకపోవుట వలన ఉపమానోపమేయములు రెండు చెప్పబడినవి. అందువలన అనన్వయాలంకారమైనది.**

----- ---: **ఇత్యాదౌ అని చెప్పుట వలన మరికొన్ని ఉదాహరణలు కూడ చెప్పబడుచున్నవి.**

गगनं गगनाकारं सागरः सोगरोपमः |
रामरावयोर्युध्दं रामरावणयोरिव ||

ఆకాశము ఆకాశము యొక్క ఆకారము కలిగినది. సముద్రము సముద్రముతో సమానమైనది. రామరావణుల యొక్క యుద్ధము రామరావణుల యుద్ధము వంటిది.

ఈ శ్లోకం నందు మూడు వాక్యములు కలవు. మొదటి వాక్యము నందు ఆకాశమునకే ఉపమానము, ఉపమేయము కూడ చెప్పబడినవి. రెండవ వాక్యమునందు సముద్రమునకే ఉపమానోపమేయములు చెప్పబడినవి. మూడవ వాక్యమునందు కూడ రామరావణుల యొక్క యుద్ధమునకే ఉపమానోపమేయములు చెప్పబడినవి. ఇందువలన ఈ మూడు వాక్యములు కూడ అనన్వయాలంకారమునకే ఉదాహరణములైనవి.

3. उत्प्रेक्षालङ्कारः

उत्प्रेक्षोन्नीयते यत्र हेत्वादिर्निह्नुतिं विना।
त्वन्मुखश्रीकृते कृते नूनं पद्मैर्वैरायते शशी॥

ఉత్ప్రేక్షోన్నీయతే యత్ర హేత్వాదిర్నిహ్నుతిం వినా |
త్వన్ముఖ శ్రీకృతే కృతే నూనం పద్మైర్వైరాయతే శశీ ||

లక్షణము : ఎచ్చట ప్రకృతమును ఆశ్రయించుకొని స్వరూప హేతుఫలములు ఊహింపబడునో అచ్చట ఉత్ప్రేక్షాలంకారము సంభవింపగలదు. అనగా ప్రకృతమును విడిచిపెట్టక స్వరూపముననో, హేతువునో, ఫలమునో ఊహించినచో అది ఉత్ప్రేక్ష కాగలదు. ఇది స్వరూపోత్ప్రేక్ష, హేతూత్ప్రేక్ష, ఫలోత్ప్రేక్షయని మూడు విధములు.

1. स्वरूपोत्प्रेक्षाः

लिम्पतीव तमोङ्गानि वर्षतीवाञ्जनं नभः।

చీకటి శరీరావయవములను కప్పుచున్నదాయనునట్లు, ఆకాశము కాటుకను వర్షించుచున్నదాయనునట్లుగా ఉన్నది.
గాఢత్వము (చిక్కదనము) ఆచ్ఛాదకత్వము (కప్పియుంచుట) అనునవి చీకటి యొక్కస్వరూపములు. అవియే ఊహింపబడినవి కావున ఇది స్వరూపోత్ప్రేక్ష.

2. हेतूत्प्रेक्षाः

रक्तौ तवाङ्घ्री मृदुला भुविविक्षेपणात् ध्रुवम्।

నిశ్చయముగా నీ మృదువైన పాదములు భూమిపై మోపుట వలన ఎర్రబడినవి.

పాదములు ఎరుపుగా నుండుట సహజము. కాని దానికై భూమిపై ఉంచడం వలననే ఎర్రబడినవి అని కారణము ఊహింపబడినది కావున ఇది హేతూత్ప్రేక్ష.

4. फलोत्प्रेक्षा:

त्वन्मुखश्रीकृते नूनं पद्मैर्वैरायते शशी।

ముఖ సౌందర్యాన్ని పొందగోరి చంద్రుడు పద్మములతో కలహించుచున్నాడు.

చంద్రుడు ఉదయించినప్పుడు పద్మములు ముడుచుకొనిపోవును. ఈ లోక సహజమైన దానిని కలహముగా ఊహింపబడినది. అంతియేకాక దీని ఫలము కూడా ఊహింపబడినది నాయిక ముఖసౌందర్యం పొందుటయే దీనికి ఫలము. అనగా నాయిక ముఖము పద్మముల కన్ననూ, చంద్రుని కన్ననూ కూడా సుందరమైనదను ఫలము కూడా సిద్ధించుచున్నది. కావున ఇది ఫలోత్ప్రేక్ష.

ఉత్ప్రేక్షాలంకారము నందు *मन्ये, शंके, ध्रुवं, प्राय:, नूनं, इव* మొదలైన పదములు ఉత్ప్రేక్షా బోధకములు.

4. दीपकालङ्कारः

प्रस्तुताप्रस्तुतानां च तुल्यत्वे दीपकम् मतम्।
मेधां बुधः सुधामिन्दुर्बिभर्ति वसुधां भवान्॥

ప్రస్తుతాప్రస్తుతానాం చ తుల్యత్వే దీపకమ్ మతమ్ |
మేధాం బుధః సుధామిందుర్బిభర్తి వసుధాం భవాన్ ||

प्रस्तुताप्रस्तुतानां = ప్రస్తుతమునకు అప్రస్తుతమునకు, तुल्यत्वे = సమానత్వము చెప్పినచో, दीपकम् मतम् = దీపకము కాగలదు.

లక్షణము : వర్ణ్య విషయములకు, అవర్ణ్య విషయములకు ఒకే ధర్మము లేక సమానత్వము చెప్పబడినచో దానిని దీపకాలంకారమందురు.

बुधः = పండితులు, मेधां = బుద్ధిని, इन्दुः = చంద్రుడు, सुधां = అమృతమును, भवान् = నీవు, वसुधाम् = భూమిని, बिभर्ति = ధరించుచున్నారు.

లక్ష్యము : పండితులు బుద్ధిని, చంద్రుడు అమృతమును, నీవు భూమిని ధరించుచున్నావు.

వివరణ : నీవు భూమిని ధరించుచున్నావు అనునది ప్రస్తుతము. కానీ పండితులు బుద్ధిని, చంద్రుడు అమృతమును అనునవి అప్రస్తుతములైన విషయములు. అయినప్పటికినీ వీటి అన్నింటికి ఒకే ధర్మము 'बिभर्ति' ధరించుట అనునది చెప్పబడినది కావున ఇది దీపకాలంకారము .

5. अप्रस्तुत प्रशंसालङ्कारः

अप्रस्तुत प्रशंसा स्यात् सा यत्र प्रस्तुतानुगा।
एकः कृती शकुन्तेषु योऽन्यं शक्रान्न याचते ॥

అప్రస్తుత ప్రశంసా స్యాత్ సా యత్ర ప్రస్తుతానుగా |

ఏకః కృతీ శకుంతేషు యో అన్యం శక్రాన్న యాచతే ॥

లక్షణము : यत्र = ఏ వాక్యమందు, अप्रस्तुतप्रशंसा = అప్రస్తుత ప్రశంస, प्रस्तुतानुगा = ప్రస్తుతము నాశ్రయించియుండునో, सा = అది, अप्रस्तुतप्रशंसा = అప్రస్తుతప్రశంసాలంకారము, स्यात् = అగును.

ఈ వాక్యమందు అప్రస్తుత ప్రశంస ప్రస్తుతము నాశ్రయించి యుండునో, అది అప్రస్తుతప్రశంసాలంకారమగును. అనగా ప్రస్తుతము స్ఫురించునట్లుగా అప్రస్తుతమును వర్ణించినచో అప్రస్తుత ప్రశంసాలంకారమగును.

ఉదా : शकुन्तेषु = పక్షులలో, एकः ఒక చాతకపక్షి, कृती = సుకృతమైనది, यः = ఏ చాతకపక్షి, शक्रात् = దేవేంద్రుని కంటె, अन्यं = వేరొకరిని, न याचते = యాచించదో.

ఏ చాతకపక్షి దేవేంద్రుని కంటె మరియొకనిని యాచించదో, ఆ చాతకపక్షి యొక్కటే పక్షులలో సుకృతమైనది.

సమన్వయము : **పై వాక్యమునందు దేవేంద్రుని యాచించు చాతకపక్షి వర్ణించబడుచున్నది. దేవేంద్రుడు వర్షమును కురిపించువాడగుట వలన, వర్షము కొరకు దేవేంద్రుడు యాచించును. ఇది అప్రస్తుతము. కానీ ఈ అప్రస్తుత ప్రశంస వలన నీచులను యాచించని ఒక యాచకుడు స్ఫురించుచున్నాడు. అప్రస్తుతమైన చాతకపక్షి ప్రశంస ప్రస్తుతమైన యాచకుని ప్రశంసను ఆశ్రయించి యున్నందు వలన అప్రస్తుత ప్రశంసాలంకారమైనది.**

6. दृष्टान्तालङ्कारः

चेद्बिम्बप्रतिबिम्बत्वं दृष्टान्तस्तदलंकृतिः।

त्वमेव कीर्तिमान् राजन् विधुरेव हि कान्तिमान्॥

చేద్బింబప్రతిబింబత్వం దృష్టాంతస్తదలంకృతి: |

త్వమేవ కీర్తిమాన్ రాజన్ విధురేవ హి కాంతిమాన్ ||

లక్షణము : बिम्बप्रतिबिम्बत्वं चेत् = బింబ ప్రతిబింబత్వమున్నచో, तदलंकृतिः =ఆ అలంకారము, दृष्टान्तः = దృష్టాంతము.

ఉపమానోపమేయములకు యున్న వేరువేరు గుణములు బింబ ప్రతిబింబ భావముగా చెప్పబడినచో దృష్టాంతాలంకారమగును.

ఉదా : राजन् = ఓ రాజా!, त्वमेव = నీవే, कीर्तिमान् = కీర్తిమంతుడవు, विद्ुः एव =చంద్రుడే, कान्तिमान् = కాంతిమంతుడు.

ఓ రాజా ! నీవే కీర్తిమంతుడవు. చంద్రుడే కాంతిమంతుడు.

సమన్వయం : **పై వాక్యమునందు రాజు కీర్తిమంతుడు అని చెప్పవలసియున్నది. రాజు ఉపమేయము. చంద్రుడు ఉపమానము. రాజు కీర్తిమంతుడు అను వాక్యసారము చంద్రుడే కాంతిమంతుడు అను వాక్యమునందు ప్రతిబింబించినది. కావున ఉపమానోపమేయములకు గల వేరువేరు ధర్మములు బింబ ప్రతిబింబ భావముగా చెప్పబడుట వలన దృష్టాంతాలంకారమైనది.**